
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.9 : కనిష్ఠం 26.5

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్

జిల్లా వార్తలు

కల్తీ కల్లు విక్రయాలపై పట్టింపేది?



జిల్లాలో యథేచ్ఛగా రసాయనాలు కలిపిన కల్లు విక్రయాలు



బాన్సువాడ ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- డిపోలు, దుకాణాలపై కానరాని అధికారుల నిఘా
- పలు చోట్ల రసాయనాలు కలిపిన కల్లు అమ్మకాలు
- కల్లు విక్రయదారులకు డిపో పరిధిలోని నేతల అండ
- కామారెడ్డి జిల్లా బీర్కూర్, నస్రుల్లాబాద్ ఘటనలతో జిల్లాలో తనిఖీలు చేపట్టిన అధికారులు



నిజామాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కల్లు విక్రయాలపై పట్టింపు లేదు. కొన్ని డిపోల పరిధిలో కల్తీకల్లు విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా చర్యలు కరువు. అక్రమంగా డైజోఫాం, అల్ప్రాజోలం తరలిస్తూ కల్తీకల్లు తయారు చేస్తున్నా తనిఖీలు లేవు. ఉమ్మడి జిల్లా పరిధిలో తాటి, ఈత వనాలు తక్కువగానే ఉన్నా.. అన్ని సీజన్‌లో కల్తీకల్లు అమ్మకాలు జోరుగా పెరిగాయి. తాటి, ఈత కల్లే ఎక్కువగా అమ్మాల్సి ఉన్నా.. కొన్ని కల్లు దుకాణాల్లో రసాయనాలతో తయారు చేసిన కల్తీ కల్లు అమ్మకాల వల్ల వినియోగదారులు అనారోగ్యాలపాలవుతున్నారు. అస్వస్థతకు గురై ఆసుపత్రులపాలు అవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీర్కూర్, నస్రుల్లాబాద్ పరిధిలో కల్తీకల్లు తాగి 67 మందికి పైగా అస్వస్థతకు గురికాగా నిజామాబాద్, బాన్సువాడ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కల్తీకల్లును కంట్రోల్ చేయవల్సిన ఆబ్కారి శాఖ అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అన్ని పార్టీల నేతల అండదండలు ఉండటం వల్ల కల్తీకల్లు మాత్రం యథేచ్ఛగా జిల్లాలో అమ్మకాలు కొనసాగుతున్నాయి.

3లక్షల 50వేల లీటర్ల కల్లు ఉత్పత్తి

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం తాటి చెట్లు 30వేల 920 ఉండగా, ఈత చెట్లు 3లక్షల 80వేల 907 ఉన్నాయి. ఈ చెట్ల సంఖ్య ఆధారంగా ప్రతీరోజు 3లక్షల 50వేల లీటర్ల కల్లు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. జిల్లాలో చెట్లపై ఆధారపడి కల్లు అమ్ముకునేందుకు ట్రీ ఫర్ ట్యాపర్ లైసెన్సులు 303 ఉండగా టాడీ టాపర్ కోపరేటివ్ సొసైటీలు 188 ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం మొత్తం డిపోలు 491 ఉన్నాయి. నిబంధనల ప్రకారం తాటి, ఈత చెట్ల కల్లనే ప్రతీరోజు గీసి అమ్మకాలు చేయాలి. డిపోలకు కూడా ఈ కల్లునే సరఫరా చేయాలి. కానీ ఉమ్మడి జిల్లా పరిధిలో ఆల్ప్రాజోలం, డైజోఫాం కలిపిన కల్లునే ఎక్కువగా తయారు చేస్తున్నారు. అన్ని కల్లు దుకాణాల పరిధిలో ఉదయం నుంచి అమ్మకాలు చేస్తున్నారు. వ్యవసాయం, ఇతర పనుల్లో పనిచేసే వారు ఎక్కువగా ఈ కల్లుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో కొంత మంది దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. నరాల సంబంధిత వ్యాధులతో పాటు లివర్, ఊపిరి తిత్తులకు సంబంధించిన సమస్యలను కల్తీకల్లు తాగడం వల్ల ఎదుర్కొంటున్నారు. కొంత మంది రసాయనాలతో తయారు చేసిన కల్లు తాగిన వారు ఒకటి రెండు రోజులు వారికి దొరకకపోతే మతిస్థిమితం తప్పడంతో పాటు ఇబ్బందులకు గురవుతున్నారు.

చికిత్స పొందుతున్న బాధితులు

ఉమ్మడి జిల్లా పరిధిలోని బీర్కూర్, నస్రుల్లాబాద్‌లో నాలుగు రోజుల క్రితం కల్తీకల్లు తాగడం వల్ల అస్వస్థతకు 67 మంది గురయ్యారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఐదేళ్ల క్రితం నిజామాబాద్ డిపోల పరిధిలో కల్లు తాగిన వారు అస్వస్థతకు గురికాగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అందించే సమయంలో వైద్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మందికి మతిస్థిమితం తప్పి ఆసుపత్రిలో ఉండకుండా పరిగెత్తడంతో వారు కుటుంబ సభ్యులతో నిఘా ఏర్పాటు చేసి బెడ్‌లకు కట్టివేసి చికిత్స అందించారు.

ప్రజాప్రతినిధుల ప్రమేయం

ఉమ్మడి జిల్లా పరిధిలో కల్తీ కల్లు వినియోగం పెరిగినప్పటి నుంచి ప్రజాప్రతినిధుల ప్రమేయం సైతం భారీగా పెరిగింది. ఈ డిపోల పరిధిలో ఎక్కువగా వారే మద్దతు ఇచ్చి నడిపించడం వల్ల అధికారులు కూడా చర్యలు చేపట్టని పరిస్థితి ఉంది. ఎక్కడైనా అధికారులు కేసులు నమోదు చేస్తే వారిని బదిలీ చేస్తున్నారు. తనిఖీలకు వెళితే ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మాఫియాలాగా ఉమ్మడి జిల్లా పరిధిలో కల్తీకల్లు అమ్మకాలు కొనసాగుతున్నాయి. నిషేధిత అల్ప్రాజోలం, డైజోఫాంలు మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నా.. కొన్నిసార్లు పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా అదుపులోకి కావడం లేదు. బీర్కూర్, నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు వల్ల అస్వస్థతకు 67 మంది గురి కాగా జిల్లాలో మూడు రోజుల నుంచి డిపోల వెంట అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఈ కల్తీకల్లు వినియోగంపై గతంలోనే జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు పలు సంఘాలు ఫిర్యాదు చేశాయి. వీటి లైసెన్సులను రద్దు చేయాలని కోరాయి. కాగా, జిల్లాలో రసాయనాలు కలిపిన కల్లు అమ్మకుండా చూస్తున్నామని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. జిల్లాలో అన్ని డిపోలను తనిఖీ చేస్తున్నామని కల్తీకల్లు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో బుధవారం డిజిటల్ లైబ్రరీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అనేక మంది జిల్లాకు చెందిన యువతీ యువకులతో పాటు ఇతర జిల్లాల నుంచి నగరానికి వచ్చిన యువతీ యువకులు గ్రంథాలయం సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా గ్రంథాలయంలో స్థలం సరిపోవడం లేదని, ఈ సమస్యను అధిగమించేందుకు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికోసం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, తదితరులు చొరవచూపి గత నెలలో మధ్యాహ్న భోజన సదుపాయం సమకూర్చడం అభినందనీయమన్నారు. జిల్లా గ్రంథాలయం సేవలను వినియోగించుకుని ఇటీవలే సుమారు 160మంది యువతీ యువకులు పోటీ పరీక్షల్లో ప్రతిభను చాటి వివిధ శాఖల్లో ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నగేష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

అంబులెన్స్ అందజేత

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆధాంగ్ టోల్‌ప్లాజా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సీఎస్ఆర్) కింద జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు రూ.30లక్షల విలువ చేసే అంబులెన్స్‌ను అందజేశారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంబులెన్స్‌ను జిల్లా ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. వీరిలాగే మరిన్ని కంపెనీలు ముందుకు వచ్చి సీఎస్ఆర్ కింద ప్రజలకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ, జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధి కారి మధు, ఐరాడ్ మేనేజర్ వర్ష, టోల్‌గేట్ మేనేజర్ అనీల్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల పట్టాభిషేకం

వేదపండితుల మంత్రోచ్ఛరణలు భక్తుల శ్రీరామనామ స్మరణలతో సీతారాముల పట్టాభిషేకం కన్నుల పండువగా సాగింది. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితులు సముద్రాల శ్రీధరాచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు తులసీ మురళీధరచార్య, కందాళై రాఘవాచార్య పట్టాభిషేకం జరిపారు. భక్తులు సీతారామ చంద్రస్వామి గోవిందా అంటూ నామస్మరణలు చేస్తూ పట్టాభిషేకాన్ని తిలకించారు. కార్యక్రమంలో పండితులు సేనాపతి వేణుగోపాలాచార్య, సముద్రాల రామాచార్య, కలకుంట్ల నర్సింహా మూర్తి, మాకునూరి రాకేష్ ఆచార్య, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

-నిజామాబాద్ కల్చరల్



సీతారాముల పట్టాభిషేకం జరుపుతున్న వేద పండితులు

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కడ్తా పేరిట రైతులను నష్టపరిస్తే ఉపేక్షించబోం
- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

భీమ్‌గల్ రూరల్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కడ్తా పేరిట తరుగు తీసి రైతులను నష్టపరిస్తే ఉపేక్షించబోమని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించారు. మండలంలోని బడా భీమ్‌గల్, గోన్‌గొప్పుల గ్రామాలలో సహకార సంఘాలు, ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గోన్‌గొప్పులలో కొనుగోలు కేంద్రంలో నిర్దేశిత పరిమాణం కంటే కొంత ఎక్కువ ధాన్యం తూకం వేస్తుండడం వల్ల తాము నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో నిర్ణీత పరిమాణంలోనే ధాన్యం తూకం వేయాలని అధికారులను ఆదేశించారు. రైతులను నష్టపరిచే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి పోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులను పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా, సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి లారీలలో లోడ్‌చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీగా విద్యుత్ వినియోగం



- జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు 13.7 మిలియన్ యూనిట్ల సరఫరా
- వ్యవసాయం, గృహ అవసరాలకు పెరిగిన విద్యుత్ డిమాండ్

నిజామాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. గడిచిన నెలరోజులుగా ఎండలు తీవ్రతరం కావడంతో అన్ని రంగాల్లో విద్యుత్ వాడకం పెరిగిపోయింది. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు ప్రతీరోజు డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలో ప్రస్తుతం ప్రతీరోజు 13.7 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుంది. ఎండల తీవ్రతను బట్టి వినియోగం పెరుగుతుండటంతో ఎన్‌పీడీసీఎల్ అధికారులు సైతం విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయానికి రాత్రి వేళలో డిమాండ్ తగ్గుతుండటంతో పెరుగుతున్న గృహ అవసరాలకు మళ్లిస్తున్నారు. జిల్లాలో అధికార కోతలు లేకున్నా.. సాంకేతిక సమస్యలతో పలు ప్రాంతాల్లో ప్రతీరోజు సరఫరాను నిలిపివేస్తూ మరమ్మతులను కొనసాగిస్తున్నారు.

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో నెలరోజులుగా ఎండలు భారీగా పెరిగాయి. జిల్లాలో 39 నుంచి 42 డిగ్రీల మధ్యన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని మండలాల పరిధిలో ఎక్కువగా ఉంటుండగా మరికొన్ని మండలాల పరిధిలో కొంతమేర ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా సరాసరి 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. జిల్లాలో సగటున ప్రతీరోజు 13.7 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుంది. దీనిలో సరాసరి 6.72వేల మిలియన్ యూనిట్లు గృహ అవసరాలకే వినియోగిస్తున్నారు. జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్‌లు 4 లక్షల 85వేలు ఉన్నాయి. ఎండలు పెరగడం వల్ల ఫ్యాన్‌లతో పాటు కూలర్లు, ఏసీలు ఎక్కువగా వాడటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. జిల్లాలో వ్యవసాయ కనెక్షన్‌లు ఒక లక్షా 86వేలకు పైగా ఉన్నాయి. ఇవే కాకుండా కమర్షియల్ కనెక్షన్‌లు 12వేల వరకు ఉన్నాయి. పంటలు చివరి దశలో ఉండటం వల్ల వ్యవసాయానికి కూడా విద్యుత్ వినియోగం ఎక్కువైంది. ప్రతీరోజు 3.5 మిలియన్ యూనిట్ నుంచి 4 మిలియన్ యూనిట్ల వరకు వినియోగిస్తున్నారు. ఒకేసారి వినియోగం పెరగడం వల్ల అన్ని లైన్‌ల పైన లోడ్ పెరిగింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రధాన లైన్‌లతో పాటు అన్ని లైన్‌లను మరమ్మతులు చేస్తున్నారు. దీంతో కొంత మేర సరఫరాను నిలిపి వేస్తున్నారు. జిల్లాలో ఏదోఒక ప్రాంతంలో మూడు నుంచి నాలుగు గంటల పాటు కోతలు విధించి లైన్‌ల మరమ్మతులు కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రవీందర్‌ణ తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను కొనసాగిస్తున్నామన్నారు. రాత్రివేళల్లో గృహ అవసరాలకు విద్యుత్ వినియోగం ఎక్కువైందని ఆయన తెలిపారు. ఏ గ్రామం పరిధిలో కూడా ఇబ్బందులు లేకుండా సరఫరాను కొనసాగిస్తున్నామని విద్యుత్ కోతలు లేవని ఆయన తెలిపారు.

ప్రతి నీటి చుక్కనూ సద్వినియోగం చేసుకోవాలి

- లక్ష్మి ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల నిలిపివేత
- మరో మూడురోజులు కాకతీయ, సర్వసతి కాలువలకు నీటి విడుదల

మెండోర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ, సరస్వతి కాలువలకు కొనసాగుతున్న ప్రతి నీటిచుక్కనూ ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సారెస్పీ ఎస్‌ఈ శ్రీనివాస్‌రావు గుప్త తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకతీయ, సరస్వతి కాలువలకు మరో మూడు రోజులపాటు నీటివిడుదల కొనసాగుతుందన్నారు. ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ప్రాజెక్టు లక్ష్మికాలువ ఎత్తిపోతల పథకాలకు బుధవారం నీటిని నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి విలువ 1062 అడుగుల 12.556 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



వీడీసీల ఆగడాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం
- పోలీసు కమిషనర్ సాయిచైతన్య 6

వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై నిరసన
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన సీపీఎం నాయకులు
- గ్యాస్ సిలిండర్‌ను మోస్తూ ధర్నాచౌక్‌లో సీపీఐ నాయకుల నిరసన

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు 4
- రూరల్ నియోజక వర్గానికి ఏడు వేల ఇళ్ల మంజూరు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పదేళ్లలో ఇందూరు నిర్లక్ష్యానికి గురైంది
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ 6

సుద్దులంలో ఉపాధిహామీ పనుల పరిశీలన



సుద్దులంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోటగిరి,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. గుట్ట ప్రాంతంలో కందకాల తవ్వకం పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. కూలీలకు పని ప్రదేశంలో వసతి కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగారాం తదితరులున్నారు.

గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



రామన్నపేట్‌లో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

వేల్పూర్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఉషా రాణి అన్నారు. బుధవారం మండలంలోని రామన్నపేట్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఉషారాణి మాట్లాడుతూ వేయి రోజులు (గోల్డెన్ డేస్) గర్భందాల్చిన నాటి నుంచి బిడ్డ రెండున్నర సంవత్సరాల వయసు వరకు తీసుకోవాల్సిన అనుబంధ పోష కాహారం, జాగ్రత్తలు, ఆరోగ్య పరీక్షలు వాటిపై అవగాహన కల్పించారు. గృహసందర్శనలు, ముర్రుపాల ప్రాముఖ్యత, బాలింతలు ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని,గర్భిణులు రోజు తప్పకుండా అను బంధ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు, ఆయలు పాల్గొన్నారు.

కొండగట్టుకు వేల్పూర్ అంజన్న స్వాములు



కొండగట్టుకు కాలినడకన బయలుదేరిన అంజన్న స్వాములు

వేల్పూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండల కేంద్రం నుంచి బుధవారం అంజన్న స్వాములు కొండగట్టుకు కాలినడకన బయలుదేరారు.అభయాంజనేయ, జంబిహనుమాన్ ఆలయ స్వా ములు కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లారు. అంతకుముందు ఆంజనేయ స్వామికి స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మోర్తాడ్,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని సుంకెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన తండాలో బుధవారం బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. 17 ఏళ్ల అమ్మాయికి బాల్య వివాహాన్ని జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని పెళ్లి పెద్దలతో మాట్లాడి ఇరు వర్గాలతో చర్చించి బాల్యవివాహాన్ని నిలిపి వేయించారు. బాలికను తీసుకువెళ్లి జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పర్చినట్లు ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణ తెలిపారు. వారివెంట మోర్తాడ్, సుంకెట్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్లు దేవగంగు, జ్యోతి ఉన్నారు.

మొరం రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

కోటగిరి,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో మొరం తవ్వకాలను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్ట ప్రాంతంలో రాత్రి, పగలు తేడా లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. గుట్ట ప్రాంతంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో పాటు రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చారా అని తహసీల్దార్ గంగాధర్‌ను ప్రశ్నించగా తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ తెలిపినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా మొరం అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాజా, అరుణ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో అంబేద్కర్ యువజన సంఘం ఎన్నిక

ఎడపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని పోచారం గ్రామ అంబే ద్కర్ యువజన సంఘాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సతీష్, కోశాధికారిగా అల్వల శ్రీనుని ఎన్నుకున్నారు. అధ్యక్షులు గైని సతీష్‌ను. కోశాధికారి అల్వల శ్రీనును యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దండెం సాయిలు(కుమార్) శాలువాతో సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడెం వెంకటేష్, దండె ఆనంద్, మోర్ విశాల్, నీరడి దినేష్, ఈశ్వర్‌లు తదితరులు ఉన్నారు

'రైతులు పథకాలను వినియోగించుకోవాలి'

రామారెడ్డి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి కోతను సద్వినియోగం చేసుకోవాలని అడ్లూరు ఎల్లారెడ్డి సింగిల్ విండో సొసైటీ చైర్మెన్ సదాశివరెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో బుధవారం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వరి కోతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వరి కోతను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అనంతరం రైతులకు గిట్టుబాటు ధర, పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో విండో సొసైటీ సీఈవో కడెం భైరయ్య, ఎఎంసి డైరెక్టర్ ఎండి రావూఫ్, రైతులు నారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు సల్మాన్, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

డోమకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై స్రవంతి అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండల పరిధిలోని అంబర్‌పేట, సంగమేశ్వర్, ముత్యంపేట, చింతమాన్‌పల్లి, గొట్టిముక్కుల, లింగుపల్లి, అంచనూర్, కోనాపూర్, డోమకొండ గ్రామాలలో ఎవరైన కొత్తవ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వేసవికాలం ఉన్నందున ప్రజలు ఆరుబయట, స్లాబుపైన నిద్రిస్తే తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళలు ఉదయం సమయంలో ఇంటి ముందు వాకిలి ఊడ్చడం, ముగ్గువేయడం, కుళాయి నీరు పట్టుకోవడం, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తున్నపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలన్నారు.

రైతులను నష్టపరిచే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించం

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



పెద్దవాల్గోట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సిరికొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను నష్టపరిచే చర్యలకు పూనుకుంటే చూస్తూ ఉపేక్షించబోమని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు.సిరికొండ మండలం పెద్దవాల్గోట్, భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పుల, బడాభీమ్‌గల్ గ్రామాల్లో సహకార సంఘాలు, ఐకేపీ మహిళ సంఘాలు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బుధవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి ధాన్యం తీసుక వచ్చిన రైతులను పలుకరించి ఏమైన ఇబ్బందులు ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు.గోన్‌గొప్పులలో నిర్దేశిత పరిమాణం కంటే కొంత ఎక్కువ ధాన్యాన్ని తూకం వేస్తుండడం వల్ల తాము నష్టపోతున్నట్లు పలువురు రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.ధాన్యాన్ని నిర్దేశిత పరిమాణం కంటే ఎక్కువ దాన్యం తూకం వేయొద్దని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతులకు నష్టం చేసే చర్యలను ఎంత మాత్రం ఉపేక్షించబోమని స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు.అకాల వర్షం కురుస్తే ధాన్యం తడిసి పోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ సాఫీగా సాగేలా అందరు కృషి చేయాలని అధికారులను కోరారు. రైతులు ధాన్యంతెచ్చిన వెంటనే తూకం వేసి లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని నిర్వాహ కులను ఆదేశిం చారు. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ త్వరగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు.అదనపు కలెక్టర్ వెంట డీఆర్‌డీవో మరియు జిల్లా పరిషత్ సీఈవో సాయగౌడ్,సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

ఇందల్వాయి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ప్రతిష్టాత్మ కంగా ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల రైతులు సద్వి నియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకట్రావ్ అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, వెంగల్‌పాడ్, కేకేతండా, రంజిత్‌నాయక్ తండా, తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్రావ్, ఎంపీడీవో అనంత్‌రావు, ఏపీఎం సువర్ణ,ఐకేపీ సీసీలు అనురాధ, ఉదయ్, గోవింద్, ఆయా గ్రామాల మహిళాసంఘాల నాయకురాలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండలంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ తంబూరు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రైతులు తగిన తేమ శాతంతో స్వచ్ఛమైన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని దళారులను నమ్మి మోసపోవద్దని నేరుగా వరి కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తుందని, సన్నరకం వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ జీవన్; ఆలూరు కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, డైరెక్టర్లు కల్లెం సాయిరెడ్డి, ప్రమోద్, బార్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● మార్కెట్ కమిటీలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్:రబీసీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేసేందుకు మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కిషన్, ఈనామ్ ఇన్‌చార్జి శంకర్‌దాస్, మెప్మా ఇంచార్జి నవీన, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తాం

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



పడ్కల్‌లో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేద ప్రజలందరికి ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధ వారం మండలంలోని పుప్పాలపల్లి, గన్యతాండ, మాదాపూర్, బాలనగర్, సికింద్రాపూర్, పడ్కల్, కేశ్‌పల్లి, కలిగోట్, చింతలూర్ గ్రామాలలో రూ.6కోట్ల 4లక్షల 74 వేలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. అనం తరం పడ్కల్ లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ నియోజక వర్గానికి 7వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూర య్యాయన్నారు. మొదటి విడుతలో ఇళ్ల స్థలాలు ఉన్న వారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకోవడానికి ముందుకు వస్తే అర్హులైన పేద ప్రజలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. రెండవ విడుతలో ఇళ్ల స్థలాలు లేని పేద ప్రజలను గుర్తిం చి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. రాబోయే మూడేళ్లలో గ్రామాలలో ఇండ్లు లేనివారు కనిపించకూడదని అందరికి ఇళ్లు ఉండాలని లేని వారి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వం రూ. 52 కిలో సన్నబియ్యం కొనుగోలు చేసి రేషన్ కార్డు ద్వారా ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలు వండుకొని సంతోషంగా మూడుపూటల భోజనం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మహిళలకు ఎన్నో సంక్షేమ ప్రవేశపెట్టిందని ఈ పథకాలను మహిళలకు అందిస్తు అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల పేరు మీదుగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, మహిళ సంఘాల సంఘాలే నడుపుకోవడానికి బస్సులను వారికి ఇస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కొనుగోలు కేంద్రాలలో దాన్యం తూకం వేసేటప్పుడు తరుగు తీయవద్దని ఇందులో రైతులను మోసం చేస్తే కొనుగోలలో అవకతవకలు జరిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రెండేళ్లలో ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను వాటికి వడ్డీలు కడుతూ అప్పులు తీరుస్తున్నామన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల అభివృద్ధిని బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకుంటుందన్నారు. ఈ పార్టీలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి,మాజీ డీసీఎంఎస్ చైర్ సాయిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీ ఎంపీపీ అ ప్పాల పెద్ద రాజన్న, మాజీ సర్పంచ్‌లు ఎం. చిన్న సాయిరెడ్డి, శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పురుషోత్తం, శ్రీధర్, కలిగోట గంగాధర్, మద్దుల రమేష్, జితేందర్ నాయక్, బోజన్న, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మహిళలు

రామారెడ్డి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కోసం విద్యార్థినిలు, మహిళలు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కళాశాల, పాఠశాల విద్యార్థినిలు, మహిళలు పెద్ద ఎత్తున బుధవారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామం నుంచి గ్రామ స్టేజి వద్దకు చేరుకొని కామారెడ్డి - భీంగల్ పెద్ద రోడ్డుపై అటు ఇటు కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమయానికి అనుకూలంగా బస్సు రాకపోవడం తమకు ఇబ్బంది ఉందని గతంలో మాదిరిగా బస్సు సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. సమాచారం అందుకున్న రామారెడ్డి ఎస్ఐ నరేష్ నేతృతంలో పోలీసులు రాస్తారోకో వద్దకు చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, కళాశాల విద్యార్థినిలు, మహిళలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆలూర్, ఏప్రిల్09(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి తెలుపడంతో ఆయన సీఎం ఆర్ సహాయ నిధి రూ. 35000 వారి కుటుంబ సభ్యులకు మంజూరు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ జీవన్, బార్లముత్యం తదితరులు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కోటగిరి,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూరు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రుద్రూరు ఎస్ఐ సాయన్న ప్రారంభించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో రక్తపు నిల్వలు లేకపోవడంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్, ఎంఈవో శ్రీనివాస్, కర్నె శంకర్, వెంకట రమణ, క్లబ్ సభ్యులు శ్యాంసుందర్, ప్రశాంత్, సాగర్, మధు, మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ పరిష్కార వేదిక

గాంధారి,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటుచేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ విజయసారధి, ఏడీఈమల్లేష్ తెలిపారు. లింగంపేట, శెట్పల్లి సంగారెడ్డి, గాంధారి,సర్వాపూర్ సెక్షన్‌లకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఏమైన సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

రామారెడ్డి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):గర్భిణీలు పేర్లు నమోదు చేసుకోవాలని రామారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరువలేనివని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకుని మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్ వైజర్ జ్యోతి, ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

'ధరలను పెంచి మోసం చేస్తున్నారు'

సిరికొండ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పన్నులు సంపన్నులకు రాయితీలు ఇస్తూ భారత ప్రధాని దేశప్రజలను వంచనకు గురిచేశారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ విమర్శించారు. వంటగ్యాస్, పెట్రోల్, డీసెల్ ధరలను పెంచి పేద మధ్యతరగతి ప్రజలను నట్టేట ముంచిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను బుధవారం సిరికొండలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చడానికిరాయితీలు చెల్లిస్తున్న బీజేపీ ప్రభుత్వం సామాన్యమధ్య తరగతి ప్రజలను మాత్రం పేదోళ్లుగానే తయారు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ పదకొండేళ్లుగా కార్పోరేట్లకు కొమ్ముకాస్తూ పేదోళ్ల, మధ్యతరగతి ప్రజలు నిత్యం ఉపయోగించే వంటగ్యాస్,పెట్రోల్, డీసెల్ ధరలను పెంచడం వల్ల నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి పేదోళ్ల పేదోల్లుగానే మిగిలిపోతున్నారన్నారు.

మహమ్మద్‌నగర్‌లో రోడ్డుపనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మహమ్మద్‌నగర్, ఎప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలం అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ తెలిపారు. మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో సీసీరోడ్డు పనులను మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషితో సీసీరోడ్ల పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఎల్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మండలంలోని గ్రామాలలో సీసీరోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని రూ.1 కోటితో చేపట్టిన సీసీరోడ్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆకాష్, రమేష్, తోటరాజు, రాములు పాల్గొన్నారు.

సమాంతర పాలన సాగిస్తున్న వీడీసీలను రద్దు చేయాలి

● రాష్ట్ర నాయకుడు పెద్ది వెంకట్‌రాములు



తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులతో మాట్లాడుతున్న పెద్ది వెంకట్‌రాములు

మోర్తాడ్,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ లో బుధవారం గౌడసంఘం సభ్యులను కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రతినిధులు కలిశారు. గౌడ సంఘంలో మహిళలు సంఘసభ్యులతో రాష్ట్రనాయకులు పెద్దివెంకట్‌రాములు మాట్లాడారు. మహిళలను ఆలయంలోకి రానివ్వకుండా గెంటివేసిన వీడీసీపై చర్యలు తీసుకునేందుకు అధికారులపై ఒత్తిడి చేస్తామన్నారు. గ్రామాలలో రాజ్యాంగానికి విరుద్ధంగా గ్రామాభివృద్ధి కమిటీలు గౌడ కుటుంబాలను బహిష్కరించడం సమాంతరపాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. మహిళలను గుడిలోకి రానివ్వకుండా అవమానించడం అమానుషమని అన్నారు. జిల్లా అధికారులు తక్షణమే వీడీసీ సభ్యులను అరెస్టు చేయాలని, వీడీసీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రమేష్ గౌడ్, నర్సింలుగౌడ్,శ్రీరాంగౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఎస్సై రామును కలిసి వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా గౌడ ప్రతినిధులు కోరారు.

● గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలను అరికట్టాలని ధర్నా

కోటగిరి,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడ కులస్థులపై గ్రామాభివృద్ధి కమిటీ దౌర్జన్యాలను నిరసిస్తూ బుధవారం కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గీత పనివారాల సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తిని నమ్ముకుని 15కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. రోజువారిగా చెట్లు గీసుకుని కల్లు అమ్ముకునే కుటుంబాలపై వీడీసి డబ్బులు ఇచ్చి కల్లు అమ్ముకోవాలని హుకుం జారీ చేయడం సరికాదన్నారు. వీడీసీ ఆగడాలు కుల వృత్తులపై మితిమీరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరామ నవమి రోజున కుంకుమార్చన కార్యక్రమానికి గౌడ ఆడబిడ్డలు మందిరానికి వెళ్తే ఆలయంలోకి రావొద్దంటూ పూజారి వెనక్కి పంపడం సిగ్గుచేటన్నారు. గ్రామాభివృద్ధి కమిటీలపై పీడీ యాక్టు చట్టాన్ని తీసుకువచ్చి వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు ప్రకాష్ గౌడ్, కృష్ణ, సాయికృష్ణ, అరుణ్ కుమార్, రమేష్, శ్రీనివాస్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో వినతిపత్రం సమర్పిస్తున్న గీత పనివారాల సంఘ నాయకులు

సింగీతం గ్రామంలో రసవత్తరంగా కుస్తీ పోటీలు



కుస్తీపోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

మహమ్మద్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగీతం గ్రామంలో రసవత్తరంగా కుస్తీపోటీలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మొదలుకొని సాయంత్రం వరకు 100, 200,500, 1000, 2000 ఒక్కో కుస్తీపోటీలో పాల్గొన్న మల్లయోధులకు నగదును అందజేశారు. కుస్తీపోటీలో తలపడేందుకు మహారాష్ట్ర,కర్ణాటక తెలంగాణ ప్రాంతాల నుంచి మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని వారి సత్తాను చాటారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నారాయణ, నాయకులు శ్రీధర్ రెడ్డి, నారాయణ గ్రామకమిటీ అభివృద్ధి సభ్యులు పాల్గొన్నారు.

బాన్సువాడలో...



గెలుపొందిన మల్లయోధులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

బాన్సువాడ : మండలంలోని హన్మాజీపేట గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మల్లయోధులు పెద్దసంఖ్యలో కుస్తీ పోటీల్లో తలపడ్డారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనాల సుభాష్.. అక్బర్ బోనాల సాయిలు. రంగిరి సంజీవ్. ప్రవీణ్ గౌడ్, వెంకట్ గౌడ్, శ్రీరామ గోల్డ్‌స్మిత్. సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలే నరేంద్రకు నివాళి

లింగంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసి తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వ్యక్తి ఆలే నరేంద్ర అని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆలే నరేంద్ర వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఇద్దరిపై ఫోక్సో కేసు నమోదు

నందిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలూర గ్రామానికి చెందిన మైత్రి రాజుకుమార్, అదే మండలానికి చెందిన సాలంపాడు గ్రామానికి చెందిన దంతం రాజు అనే ఇద్దరు నిందితులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఒక బాలికను ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకొని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి, కిడ్నాప్ చేసి బోధన్ మండలంలోని ఒక ఊరిలో ఉంచిన నిందితులను బుధవారం పట్టుకున్నామని ఎస్ఐ చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి వారి నుంచి సెల్‌ఫోన్, బైక్ సీజ్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ ఎం చిరంజీవి పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

కోటగిరి,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఎండీ ఇలియాస్‌కు బోధన్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్ష విధించారని కోటగిరి ఎస్ఐ సందీప్ తెలిపారు. ఇలియాస్‌కు జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమాన విధించారని ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పథంలో మన పంచాయతీలు



దేగాంలోని పల్లె ప్రకృతి వనం


దేగాం శివారులోని అవెన్యూ ప్లాంటేషన్


మోర్తాడ్ గ్రామ పంచాయతీ

● నాలుగు పంచాయతీలకు నేషనల్ పంచాయతీ అవార్డు ● రాష్ట్రస్థాయిలో మునిపల్లి మూడో స్థానం, మోర్తాడ్ నాలుగో స్థానం

ఆర్మూర్ రూరల్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో 2022-23 నాటికి దేశంలోనే గ్రామ పంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయితీ శాఖ విడుదల చేసిన పంచాయితీ పురోగతి సూచికలో ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని నాలుగు గ్రామాలు ఉత్తమ గ్రేడ్‌ను సాధించాయి. పంచాయతీలలో తొమ్మిది కొలమానాల ఆధారంగా పనితీరును కేంద్రం అంచన వేసింది. జిల్లాలోని నాలుగు పంచాయితీలు దేగాం, మె ర్తాడ్, మునిపల్లి, వల్లభపూర్, గ్రామాలు పంచాయితీ పురోగతి జాబితాలో స్థానాలు సంపాదించాయి. నేషనల్ పంచాయతీ అవార్డులను సొంతం చేసుకున్నాయి. రాష్ట్ర స్థాయిలో 25 ఉత్తమ జీపీలను ఎంపిక చేయగా మునిపల్లి గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయిలో మూడో స్థానం, మోర్తాడ్ గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం దక్కించు కున్నాయి. పంచాయతీలలో ఆరోగ్యం, పారిశుధ్యం, తాగు నీరు, జీవనోపాధి పెంపు, పంచ్చదనం, సుపరిపాలన, సామాజిక భద్రత, చిన్నారులకు సౌకర్యాల కల్పన, మహిళలకు అనుకూలమైన విధానాలు అనే తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయితీ పనితీరును లెక్కించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం పంచాయితీ అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్ పేరిట ఆన్‌లైన్ ఫోర్టల్ ఏర్పాటు చేసి దరఖాస్తులను ఆహ్వానించింది. గ్రామ పంచాయితీలలో అన్ని విభాగాల్లో మెరుగైన సౌకర్యాలు, ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను మోర్తాడ్ గ్రామ పంచాయతీ 81.29, మునిపల్లి 81. 29, దేగాం 79.56, వల్లభాపూర్ 79.9 మార్కులు సాధించాయి.

● అభివృద్ధి పనులకు ఉత్తమ మార్కులు

ఆలూర్ మండలంలోని దేగాం, జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లి, మాక్లూర్ మండలంలోని వల్లభపూర్, మోర్తాడ్ గ్రామ పంచాయతీలు అన్ని విభాగాల్లో ఉత్తమ సేవలను అందజేసినందుకు గాను మార్కులు వచ్చాయి. దేగాం గ్రామ పంచాయతీలో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు మార్కులు సాధించగా, వల్లభపూర్ నీటి సౌకర్యం అంశంపై మార్కులు పొందింది. మునిపల్లి గ్రామ పంచాయతీ అన్ని విభాగాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పనకు, మోర్తాడ్ పంచాయతీలో తొమ్మిది విభాగాల్లో ఉత్తం సేవలందించినందుకు గాను మార్కులు దక్కాయి.

● మునిపల్లి గ్రామ పంచాయతీ

మునిపల్లి గ్రామ జనాభా 2011 ప్రకారం 3798
పురుషులు 1728, మహిళలు 2070
పాఠశాలలు జడ్పిహెచ్ఎస్ 01,
ప్రాథమిక పాఠశాలలు 02
అంగన్‌వాడిలు 04, నీటి ట్యాంక్‌లు 04
ఇంకుడు గుంతలు 199, కమ్యునిటి పోఫ్ పీట్లు 07
వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం 100 శాతం

● వల్లభాపూర్ గ్రామ పంచాయతీ

వల్లభాపూర్ గ్రామ జనాభా 777
పురుషులు, 367, మహిళలు 410
పాఠశాల 01, అంగన్‌వాడీ కేంద్రం 01,
వాటర్‌ట్యాంక్ 01
ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా..
100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం

● దేగాం గ్రామ పంచాయతీ

దేగాం గ్రామ జనాభా 3129
పురుషులు 1482, మహిళలు 1647
పాఠశాల 02, పీహెచ్‌సీ 01
వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం 100 శాతం

● మోర్తాడ్ గ్రామ పంచాయతీ

మోర్తాడ్ గ్రామ పంచాయతీలో అన్ని రంగాల్లో పురోగతి సాధించినందుకు గాను రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం సాధించింది. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మహిళా సాధికారత, ఆరోగ్యం, సామాజిక భద్రత, చిన్నారులకు సౌకర్యాల కల్పనతో పాటు వివిధ సేవలకు పురస్కారం దక్కింది.

● అవార్డు రావడం సంతోషంగా ఉంది
శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, దేగాం



దేగాం గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం నేషనల్ పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల సంతోషంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు, గ్రామ ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అంకిత భావంతో పనిచేస్తాం.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

ఆస్తిపన్ను వసూళ్ల వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో ఆస్తి పన్ను వసూళ్లపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఆస్తిపన్ను వసూళ్లపై వార్డుల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోజువారి లక్ష్యాన్ని సైతం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీఒక్కరు ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలని 5 శాతం రాయితీని ప్రజలకు వివరించి పన్ను వసూలు వంద శాతం అయ్యేలా చూడాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు, వార్డు అధికారులు పన్ను వసూళ్లపై దృష్టి పెట్టి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

మోస్రా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పార్టీ అధికార ప్రతినిధి ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ ప్రభుత్వం ఈ రోజు రాజ్యాంగం మారుస్తామని గాంధీ ఆలోచనలకు వ్యతిరేకంగా పని చేస్తామని బహిరంగంగా చెబుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వాటిని తిప్పి కొడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, మోస్రా మండల కోఆర్డినేటర్ యువజన కాంగ్రెస్ షేక్ ఇంతియాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాయిలు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శంకర్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు తోట రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర నాయకులు హరినారాయణ, సైనాపురం నర్సారెడ్డి, అశోక్, జలీల్, చింతకుంట గ్రామ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లింగయ్య, శ్రీకాంత్, గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు ఎల్‌వోసీల అందజేత

మోర్తాడ్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు చెందిన బాధితులకు చికిత్స కోసం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఎల్‌వోసీ లను అందజేశారు. మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఆక్సిడెంట్‌లో రెండు కాళ్లు కోల్పోవడంతో నిమ్స్ ఆసుపత్రిలో కృత్రిమ కాళు ఏర్పాటు కోసం రూ.లక్ష ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన కల్లెడ దినేష్‌కు బ్లెడ్ క్యాన్సర్ సోకడంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరడం ఆయనకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రూ.లక్షా 50 వేల ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


బ్లేడ్ క్యాన్సర్ బాధితుడు దినేష్‌కు ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ధర్మోర గ్రామస్థులకు ఎల్‌వోసీని అందజేసిన ముత్యాల సునీల్‌కుమార్

మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన పత్రి సంయుక్త ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. తలకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో బాధిత కుటుంబ సభ్యులు ముత్యాల సునీల్ కుమార్‌ను ఆశ్రయించారు. ఆపరేషన్ కోసం సునీల్ కుమార్ రూ. 2లక్షల 5వేల ఎల్‌వోసీ ని సంయుక్తకు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

● ఇలా ఉంటే సాధన చేసేదెలా..!?
● ముళ్లపొదలు, పిచ్చి చెట్లతో అధ్వానంగా క్రీడా ప్రాంగణం

భిక్కనూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామాల్లోని క్రీడాప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా ఉంటంతో ప్రస్తుతం చాలా గ్రామాల్లో వనంలా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి, క్రీడాకారులు సాధన చేసేందుకు, ఆటలతో ఆరోగ్యమైన జీవితం అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామ గ్రామాన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి వీటిని ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శుభ్రం చేయించి, ఈ క్రీడా పాంగణంలో పలు క్రీడలకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసి అప్పటి ప్రజా ప్రతినిధులతో ఆడంబరంగా ప్రారంభించారు. క్రీడాకారులకు ఎంతో సహాయంగా ఉంటాయని భావిస్తే ఆ క్రీడా ప్రాంగణాలపై ప్రజా ప్రతినిధులు గానీ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం భిక్కనూరు మండలంలో పిచ్చిచెట్లు, ముళ్ల పొదలు మొలకెత్తి వనంలా తయారయ్యాయి. కాగా చాలాగ్రామాల్లో క్రీడలకు అనువుగా లేని స్థలాల్లో ఏర్పాటు చేయడం, అనువుగా ఉన్న స్థలాల్లో సరైన వసతులు కల్పించకపోవడంతో ఈ క్రీడా ప్రాంగణాలు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. కాగా చాలా గ్రామాల్లో ఈ క్రీడా ప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఉండటంతో కూడా ఆటలకు అనుకూలంగా లేవనే విమర్శలు ఉన్నాయి. కాగా పలుగ్రామాల్లో ఈ క్రీడా పాంగణాలను మందుబాబు అడ్డాలుగా మార్చుకున్నారు.

● కేవలం బోర్డులకే పరిమితం..
ఇలా ఉంటే సాధన చేసేదెలా..

మండలంలో రూ.వేలు ఖర్చు పెట్టి గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి అందులో వ్యాయామ, వాలీబాల్, ఖోఖో, తదితర క్రీడల కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తరుపున ఈ క్రీడాకారులకు సైతం వాలీబాల్, క్రికెట్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలకు సంబంధించి క్రీడాపరికరాలు, సామాగ్రి, డ్రెస్సులను అందజేసిం ది. వాటిని కూడా గ్రామపంచాయితీ అధికారులు క్రీడాకారులకు అందిం చకుండా గ్రామ పంచాయతీల్లోనే భద్రపరిచారు. ప్రస్తుతం ఈ క్రీడా ప్రాంగణాల్లో పెద్దబోర్డు, వ్యాయామానికి సంబంధించిన కొన్ని పరికరాలు మాత్రమే ఉన్నాయి. క్రీడాకారులు, పోలీసు, ఆర్మీ సెలక్షన్ల కోసం సాధన చేసే యువకులు వెంచర్లు, ఖాళీ స్థలాలను ఆశ్రయిస్తున్నారు. నిజానికి ఒక్కో క్రీడా పాంగణం కనీసం రెండు ఎకరాల స్థలంలో ఈ ప్రాంగణాలు ఉంటే క్రీడాకారులకు క్రీడలు ఆడటానికి, ప్రతిరోజు వాకింగ్ చేయ్యడానికి అనువుగా ఉంటుంది.



భిక్కనూరులో క్రీడా ప్రాంగణం

● ముళ్లపొదలు, పిచ్చి చెట్లతో అధ్వానంగా క్రీడా ప్రాంగణాలు..

గ్రామాల్లో క్రీడాకారులను పోత్రహించి వారికి కావాల్సిన వసతులు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడాపాంగణాలలో సరైనా వసతులు కల్పించకపోవడంతో యువకులు, క్రీడాకారులు అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. దీంతో ఈ క్రీడా పాంగణాలు పిచ్చిచెట్లు, ముళ్ల పొదలు మొలకెత్తి వనంలా తయారయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో పందులకు గుడారాలుగా మారుతున్నాయి. ఇప్పటికే ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ముగియగా, మరికొన్ని రోజుల్లో పాఠశాలలకు వేసవీ సెలవులు రానున్నడంతో అక్కడక్కడా కొందరు యువకులు, చిన్నారులు ఈ క్రీడా ప్రాంగణంలో కొంత భాగాన్ని శుభ్రం చేసుకుని వాలీబాల్ షటిల్ ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి మంచి ఆశయంతో ప్రారంభించిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలని యువత కోరుతుంది.

● ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.వేలు వెచ్చించారు..

ప్రతీ గ్రామ పంచాయతీలో ఈ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు రూ.వేల రూపాయలను అప్పటీ ప్రభుత్వం వెచ్చింది. ఈ నిధులతో క్రీడా ప్రాం గణం ప్రారంభ బోర్డు, మొరానికి, మొరం చదునుకు, వాలీబాల్, ఖోఖో, వ్యాయామానికి సంబంధించిన పోల్స్, గేటు, తదితర పనులను చేపట్టారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో పలు కారణాలతో ప్రారంభ బోర్డులు, పరికరాలు, పోల్స్, చుట్టూ జాలీ ఇతరాత్ర కారణాలతో పాడయ్యాయి.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


మోర్తాడ్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పెద్దన్న

మోర్తాడ్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డ్రగ్స్ రహిత అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రిన్సిపాల్ పెద్దన్న మాట్లాడుతూ తెలంగాణలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న విద్యార్థులకు పిలుపునిచ్చారు. మన సంస్కృతిని చిన్నబిన్నం చేసేందుకు విదేశీ మార్గాల ద్వారా మత్తు పదార్థాలను శత్రు దేశాలు సరఫరా చేస్తున్నాయని ఆరోపించారు. 61 శాతం యువత కలిగిన ప్రపంచంలో అతిపెద్ద దేశం భారతదేశమని ఆయన అన్నారు. మాదక ద్రవ్యాల అలవాటు వల్ల యువత మానసిన అనారోగ్యానికి, అసాంఘీక కార్యకలా పాలకు యువత బలవుతుందని అన్నారు. సమావేశంలో అంటి డ్రగ్స్ కో ఆర్డినేటర్ ఎన్ రాజయ్య, సభ్యులు పి. బ్యులా, అర్చన , మర్రిపల్లి భూపతి, యూత్ దశరథ, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదినాథ స్వామి కల్యాణోత్సవం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్రాన్‌పల్లిలో బుధవారం శ్రీ ఆదినాథ స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం స్వామివారికి భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ సిబ్బందికి ఎల్‌సీ యాప్‌పై శిక్షణ

ఎల్లారెడ్డిరూరల్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ సిబ్బందికి డీఈ కార్యాలయంలో డివిజన్ ఇంజనీర్ విజయ సారథి ఆధ్వర్యంలో ఎల్‌సీ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేసే క్రమంలో కొన్నిసార్లు అనుకోని ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. అలాంటి ప్రమాదాలను నివారించడానికి ఎల్‌సీ యాప్ సాంకేతికంగా ఉపయోగపడుతుందని దీని ఉపయోగించి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ ప్రభాకర్‌రావు, ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, లింగంపేట మండల ఏడీఈ మల్లేష్, ఏఈ రమణచారి, ఎఫ్ ఎం గంగాధర్, బాలకృష్ణన్, విఠల్, డివిజన్ పరిధిలోని పలువురు లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

జోరుగా కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు


గొట్టిముక్కుల గ్రామంలోని పెద్ద చెరువులో మట్టిని తవ్వుతున్న దృశ్యం

● దోమకొండలో 1600 మంది పనులకు హాజరు


ఆన్‌లైన్‌లో కూలీల హాజరు నమోదుకు ఫొటో తీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

దోమకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబార్‌పేట, దోమకొండ, ముత్యంపేట, చింతమాన్‌పల్లి, లింగుపల్లి, సంగమేశ్వర్, సీతారాంపల్లి, అంచనూర్, గొట్టిముక్కుల గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 1600 మంది కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం ఫిష్‌పాండ్, రోడ్డు పనులు నడుస్తున్నాయి. ఉదయం 6.30 గంటల నుంచి పనులు మొదలుకుని 11 గంటల వరకు కూలీలు పనులు చేస్తున్నారు.

● ఆన్‌లైన్‌లో హాజరు నమోదు

ఉపాధి హామీ కూలీలు చేసే పనులను ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు తమ ఫోన్‌లో ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో హాజరును నమోదు చేస్తున్నారు. కూలీలు పని ప్రదేశానికి చేరుకున్నాక మొదటి ఫోటో పనులు ముగింపు సమయంలో రెండో ఫోటోను ఎఫ్ఏలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

● మస్టర్‌లలో కూలీల సంతకాలు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ రకాల పనులు చేస్తున్న కూలీల హాజరు నమోదును ఎఫ్ఏలు పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. మస్టర్‌లలో కూలీల సంతకాలతో పాటు పని ప్రదేశంలో ఆన్‌లైన్ ఫోటోతో జత చేసి హాజరును అప్‌లోడ్ చేస్తున్నారు.

ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో కమిషనర్ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కమిషనర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. నగరంలోని ఓటర్ల జాబితా, ఓటరు నమోదు, తొలగింపు ప్రక్రియపై రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీయూలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



టీయూలో ఎన్ఎస్‌యూఐ జెండా ఎగరవేస్తున్న యూనివర్సిటీ అధ్యక్షుడు సాగర్

డిచ్‌పల్లి,ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్క రించుకొని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల వద్ద అధ్యక్షుడు సాగర్‌నాయక్ జెండాను ఎగరవేసి మాట్లాడారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘాలు ప్రోత్సహిస్తూ విద్యార్థి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఎన్ఎస్‌యూఐ సంఘ ఆవిర్భావం కోసం సుదీర్ఘంగా పోరాడుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో యూని వర్సిటీ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ లక్ష్మణ చక్రవర్తి, ప్రొఫెసర్‌లు కనకయ్య, సంపత్, పున్న య్య, మహేందర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ విజయయాత్ర ప్రచారం



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఇందూరుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే వీరహనుమాన్ విజయయాత్ర ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు.భజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు విశ్వహిందూ కార్యాలయం నుంచి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. వీధులకంటీ ఇంటింటా తిరుగుతూ విజయయాత్రను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతీ యేటా వీరహనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో సమ్మమనంతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని రాష్ట్ర సభ్యులు ప్రసాద్, ఏబీవీపీ జిల్లా ప్రతినిధి రాజు సాగర్, నవీన్, రాజేశ్వర్, విశ్వహిందూ పరిషత్ విభాగ్ ప్రముఖ్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ టాకూర్, కార్యదర్శి దయానంద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, సహ కార్యదర్శి రమేష్, కోశాధికారి శేఖర్, నగర కార్యదర్శి రామ్‌చటర్జి,ఉపాధ్యక్షుడు నికేష్, భజరంగ్‌దళ్ సహసంయోజక్ సురేష్, సుధీర్, ప్రశాంత్, సాయి, తరుణ్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భర్తను గొంతునులిపి హత్య చేసిన భార్యకు జీవితకారాగార శిక్ష విధిస్తూ జిల్లా మూడవ అదనపు సెషన్ జడ్జి ఆశలత బుధవారం తీర్పు వెలువడించారు. వివరాల్లోకి వెళితే... నవీపేట మండలం జన్నపల్లి గ్రామానికి చెందిన ముక్కల సాయిలు - రేఖా భార్యభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకొని నిత్యం శారీరక, మానసిక చిత్రహింసలకు గురిచేస్తున్నాడనే నేపంతో తనకు ప్రశాంతత దొరకడం లేదని 11 ఏప్రిల్ 2024 రాత్రి సమయంలో మద్యం మత్తులో నిద్రిస్తున్న తన భర్తను గొంతునులిమి హత్య చేసి చీరతో ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించింది. పోలీసుల విచారణలో భాగంగా భార్యనే హత్య చేసినట్లు తెలుసుకొని సాక్షాదారాలతో కోర్టులో దాఖలు చేయగా పోలీసువారి తరఫున డీడీఓపి లక్ష్మీనర్సయ్య వాదించగా జడ్జి ఆశలత కేసు విచారణ అనంతరం జీవితఖైదు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వ్యక్తిని హత్య చేసిన కేసులో ఒకరికి జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):జలీల్‌ఖాన్ అనే వ్యక్తిని కట్టెతో కొట్టి చంపిన తంగల్‌వాడి నర్సింగ్ అలియాస్ సోను అనే వ్యక్తికి జీవితకారాగా శిక్ష విధిస్తూ జిల్లా రెండో అదనపు న్యాయాధికారి తూముకుంట శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన జలీల్‌ఖాన్ ఒక మహిళను బహిరంగ ప్రదేశంలో ప్రతీరోజు బూతుమాటలు తిట్టేవాడు. విసుగుచెందిన మహిళ బంధువు నర్సింగ్ జమీల్‌ను చంపాలని నిర్ణయించుకొని 14 ఫిబ్రవరి 2024న రాత్రి 8.30లకు జమీల్ యదావిధిగా గొడవ పెట్టుకోవడానికి వచ్చినప్పుడు పక్కనే ఉన్న వెదురుబొంగు కట్టెతో జమీల్ తలపై నర్సింగ్ బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేయగా పీపీ బంటు వసంత్ కేసును వాదించగా జడ్జి ముద్దాయి నర్సింగ్‌కు జీవితకారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



నడిపల్లి సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో

డిచ్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధచూపి పంచాయతీ అభ్యున్నతి కోసం చేయూతనందిం చాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. బుధవారం డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి సచివాలయంలో ఇంచార్జి ఈవోగా రాధికను నియమించిన అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది పన్నుల వసూళ్లపై ప్రత్యేక చొరవ చూపి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చేయూతనందించాలన్నారు. నడిపల్లి శివారులోని పెట్రోల్ బంక్ వద్ద అక్రమ లేఅవుట్లను ఆయన పరిశీలించి సాగునీటి కాలువలను కబ్జా చేయడం రియల్టర్లకు తగదని ఈ విషయంలో పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు సచివాలయ సిబ్బంది ఘనసన్మానం చేశారు. ఇంచార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, ఇంచార్జి ఈవో రాధిక, పంచాయతీ సిబ్బంది రాము, సంతోష్, పంచాయతీ కారోబార్లు రాము తదితరులు పాల్గొన్నారు.

గత పదేళ్లలో ఇందూరు నగరం నిర్లక్ష్యానికి గురైంది

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల పాలనలో ఇందూరు నగరం నిర్లక్ష్యానికి గురైందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని 8వ డివిజన్ లలితనగర్, సాయిరాం నగర్, సాయినగర్, తదితర కాలనీల్లో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి బుధవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా 8వ డివిజన్‌లోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలు కీలకంగా ఉన్నాయని వర్షాకాలంలో డ్రైనేజీలు నిండిపోవడం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు డ్రైనేజీ సమస్యలను తీర్చాలని ఆదేశించారు. నగరంలో ఇప్పటికే డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిధులతో అమృత్ 2 కింద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎలక్ట్రిక్ స్తంభాలు, వీధి దీపాల కొరత ఉన్నందున అవసరమున్న చోట వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్ వాసులకు ఆహ్లాదకరమైన పార్కు, ఓపెన్ జిమ్‌తో కూడిన నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. వీధుల్లో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చిన్న పిల్లలపై, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కోతుల, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ మురళీ మోహన్ రెడ్డి, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్, ఏఈ భూమేష్, బీజేపీ నాయకులు పవన్, నాగరాజు, అంబదాస్, చంద్రశేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం సరికాదు



నగరంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):పెరిగిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఎం పార్టీలు వేరువేరుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. సీపీఐ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌ను మోస్తూ నాయకులు ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీ చేస్తూ పేదలకు మాత్రం నిత్యవసర వస్తువులైన గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై 2 రూపాయలు పెంచడం సరికాదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాకముందు రూ.400లు ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు వెయ్యి రూపాయలు అయ్యిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు భూమయ్య, రాజిరెడ్డి, రాజన్న, రాజేశ్వర్, హన్మాండ్లు, రాందాస్, రఘురాం, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం...

వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో నగరంలోని ధర్నాచౌక్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం పన్నులు వేస్తూ ప్రజలపై భారం వేస్తున్నారని అన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని లేదంటే పెద్ద ఎత్తున నిరసన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నూర్జహాన్, విఘ్నేష్, సుజాత, రాములు, అనిత, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలను నిరసిస్తూ పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రగతి శీల మహిళ సంఘం అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే అధిక ధరలను నియంత్రిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిత్యావసర సరుకుల ధరలు సామాన్య మానవులు అందుకోలేనంత విపరీతంగా పెరుగుతున్నాయని మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్ ధరను 50రూపాయలకు పెంచి ప్రజలపై భారం మోపారని దీని మూలంగా మహిళలు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైన కేంద్ర ప్రభుత్వం స్పందించిన పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు బీపాషా బేగం, సభ్యులు పార్వతి, రుక్మా, తులసమ్మ, అంజవ్వ, పద్మ, గంగామణి, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు హోటల్ యజమానులకు జైలు శిక్ష

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):వ్యాపార సమయం దాటిన తర్వా త తమ వ్యాపార కార్యక్రమాలను కొనసాగించిన ఇద్దరికి ఒకరోజు జైలు శిక్ష విధిం చినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నగరానికి చెందిన షాగౌస్ యజమాని షేక్ గౌస్‌పాషా, ఖురేషి హోటల్ యజమాని అన్వార్ హుస్సేన్‌లను బుధవారం జిల్లా స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి ముందు హాజరుపర్చగా వారికి జడ్జి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇద్దరిని జైలుకు పంపించామన్నారు. ఎవరైనా వ్యాపార సమయం తర్వాత షాపులు, హోటళ్లు, ఇతర ఏ షాపులను తెరిచి ఉంచినచో వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీతాయిపేట్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యక్రమాలు

ధర్పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సీతాయిపేట్ గ్రామంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛంద సేవా కార్యక్ర మాలు బుధవారం చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో వీధుల పరిశుభ్రత, ముళ్ల పొదల తొలగింపు, మురికి కాలువల పరిశుభ్రత, తదితర కార్యక్రమాలు చేప ట్టారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి విద్యార్థులకు అంది జీవన్‌రావు సూపర్ బ్రెయిన్ యోగాసనాల గురించి వివరించారు. సూపర్ బ్రెయిన్ యోగా వల్ల జ్ఞానం, ఏకాగ్రత, సమస్య పరిష్కారం, మెరుగైన శ్రద్ధ, సృజనాత్మకత, ఆసక్తి, మానసిక శక్తి, మానసిక సమతుల్యత, రోగనిరోధకశక్తి, మొదలైనవి పెంపొందించుకోవచ్చని వివరించా రు. ఈ సందర్భంగా విద్యార్థులచే యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాంచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో ఆన్‌లైన్ బెట్టింగ్‌పై అవగాహన



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి,ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధి లోని ఎన్ఎస్ఎస్ యూనిట్1, 4 ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌పై గ్రామస్తులకు పోలీసుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సమస్యల పరిష్కారం కోసం పోలీసులను సంప్రదించాలి కానీ బెట్టింగ్‌లు పెట్టకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారులో చెలరేగిన మంటలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):షార్ట్‌సర్క్యూట్ వల్ల కారులో మంటలు చెలరేగిన ఘటన బుధవారం జరిగింది. నగరంలోని వినాయక్‌నగర్‌లోని న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉండే సతీష్‌చంద్ర తన కారును ఇంటి ఎదుట నిలిపిఉంచగా ఒక్కసారిగా కారులో నుంచి మంటలు రాగా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. కారు ముందు భాగంలోని ఇంజన్ వద్ద షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగగా అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను ఆర్పారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఫైర్ స్టేషన్ ఎస్ఎఫ్‌వో నర్సింగ్‌రావు, సిబ్బంది మంటలను ఆర్పారు.

సామాజిక న్యాయం జాతీయవాదం అంబేద్కర్ ఆలోచన విధానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):అంబేద్కర్ రీసెర్చ్ అండ్ స్టడీ సెంటర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శం అనే అంశంపై బుధవారం సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత కన్వీనర్ అప్పాల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ బాల్యం నుండి ఉద్యోగం చేసేంతవరకు కుల వివక్షతను ఎదుర్కొన్న అంబేద్కర్ వాటిని నిర్మూలించడానికి చివరి అంకం వారికి పోరాడాడని అన్నారు. 1200 సంవత్సరాలుగా వస్తున్న అంటరానితని వ్యతిరేకంగా ఉద్యమం చేశాడని అన్నారు. అంబేద్కర్ స్వయంగా అంటరానితనాన్ని అనుభవించాడని కానీ సమాజం పట్ల అసూయ భావాన్ని పెంచు కోకుండా సమాజంలో నెలకొన్న ఈ సమస్యను రూపుమాపడం కోసం భవిష్యతు తరాలకు ఇబ్బంది రావద్దని భావించి దేశ పౌరులం దరికి ఒకే రాజ్యాంగం ఉండాలని రాజ్యాంగ రూపకల్పన చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, కమిటీ అధ్యక్షుడు పృథ్వీ, నరేందర్, అశోక్, మనోజ్, తదితరులు పాల్గొ న్నారు.

సమసమాజం నిర్మాణం కోసం విద్యార్థులు పోరాడాలి

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):సమసమాజ నిర్మాణం కోసం నేటి తరం పోరాడాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ అన్నారు. బుధవారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పాలిటెక్నిక్ కళా శాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి, ఉస్మానియా యూనివర్సిటీ అరుణ తారా కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై జరుగుతున్న వివక్షలకు వ్యతిరేకంగా అంబేద్కర్ పో రాడారని జార్జిరెడ్డి విద్యార్థుల్లో చైతన్య జ్వాలలు రగిలించాలన్నారు.ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కరిపె గణేష్, నాయకులు సృజన్, శ్రీకాంత్, తరుణ్, పాల్గొన్నారు.

వీడీసీ ఆగడాలను అరికట్టాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి కమిటీల పేరిట గ్రామాల్లో సమాంతర పాలనను కొనసాగిస్తున్నారని వీడీసీలను అరికట్టాలను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నాగభూషణం డిమాండ్ చేశారు. తాళ్లరాంపూర్ గ్రామంలో మహిళలను రామనవమి వేడుకల్లో పాల్గొనకుండా తరిమివేయడం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ డివిజన్‌లో వీడీసీల ఆగడాలు ఎక్కువయ్యాయని వీటిపై నూతన పోలీస్ కమిషనర్ దృష్టిసారించాలన్నారు. ప్రతిదాంట్లో వీడీసీల పెత్తనం ఎక్కువైందని, వారి మాట వినకపోతే కులాలను వెలివేస్తున్నారని అన్నారు. గ్రామాభివృద్ధి పేరిట ఏర్పాటైన వీడీసీలు కుల పంచాయతీలు, అన్నదమ్ముళ్ల పంచాయతీలు, ప్రైవేట్ సెటిల్‌మెంట్‌లకే పెద్దపీట వేస్తున్నారని అన్నారు. తాళ్లరాంపూర్ ఘటనకు కారకులైన వీడీసీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీపీని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న లైన్‌మేన్‌లు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని హుస్నాబాద్ గల్లీలో ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు చేపట్టారు. వేసవి కాలంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా విద్యుత్ తీగల కింద గల చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ ఏఈ మనీష పనులను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్‌లు ఐలయ్య, ప్రభాకర్, గణేష్ తదిత రులు పాల్గొన్నారు.

వీడీసీల అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదంతో అణచివేస్తాం: సీపీ



సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):గ్రామాభివృద్ధి కమిటీలు గత15 సంవత్సరాల క్రితం గ్రామాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని కాలక్రమేనా వీడీసీలు అనేక అక్రమ కార్యక్రమాలకు పాల్పడుతున్నాయని వాటిపై ఉక్కుపాదం మోపుతామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య హెచ్చరించారు.గ్రామాల్లో అభివృద్ధి అవసరాల కోసం ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు పొందకుండా తమ అవసరాలను తీర్చుకోవడం కోసం గ్రామాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నారని ఇవి అభివృద్ధి కార్యక్రమాలను కాకుండా గ్రామాలలో జరిగే సివిల్ తగాదాలు, భూతగాదాలు, వివాహ సంబంధ తగాదాలు, అన్నదమ్ముళ్ల తగాదాలు, భార్యభర్తల తగాదాలలో జోక్యం చేసుకొని వారు చెప్పింది వినని వారికి దండుగా వేసి చట్టం చేయవల్సిన పనిని వారి చేతుల్లోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు రాకుండా, న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా చేస్తున్నారని ఇది సరికాదన్నారు. గ్రామాలలో తాము చెప్పిందే వినాలని ఎవ రూ పోలీస్ స్టేషన్‌కు, న్యాయస్థానాన్ని ఆశ్రయించరాదని తమమాట విననివారిని ఆ గ్రామం నుంచి వెలివేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తూ గ్రామాల్లో డబ్బులు వసూలు చేయడానికి, గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో బెల్టు షాపులు, కూల్‌డ్రింక్, కిరాణా షాపు, ఇతర వస్తువుల అమ్మకంపై వేలం వేయడం సరికాదన్నారు. గ్రామాభివృద్ధి కమిటీలు నిర్వహించే కార్యక్రమాలన్నీ పూర్తిగా చట్టవ్యతిరేకం అని భారతదేశంలో ఏవ్యక్తి అయిన భారత ప్రభుత్వ చట్టాలను గౌరవించి ఆచట్టాలకు లోబడే తమ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్య వచ్చిన సంబంధితశాఖ అధికారులను సంప్రదించి ఆశాఖ నుంచి సహాయ సహకారాలు పొందాలి కానీ గ్రామాభివృద్ధి కమిటీలే చెప్పిందే శాసనం చేసిందే చట్టం అని ప్రజలను తప్పుదోవ పట్టించవద్దన్నారు. ఎవరికైనా ఈ గ్రామాభివృద్ధి కమిటీల వల్ల ఎలాంటి ఇబ్బందులు వచ్చిన వారు తమ దగ్గరలోని పోలీస్‌స్టేషన్ అధికారిని సంప్రదించాలన్నారు. భవిష్యతులో ఎవరైనా ఇలాంటి బహిష్కరణలు చేసినట్లయితే చట్టరిత్య కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ విషయంలో ఎవరిని కూడా ఉపేక్షించేది లేదన్నారు.

11న ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ప్రొహిబిషినరీ ఆఫీసర్, ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్, జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటీవ్, ఇంటర్న్‌షిప్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాల కోసం ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీకాం, ఎంకాం, ఎంబీఏ పాసైన పురుషులు, మహిళలు అర్హులని ఆయన తెలిపారు. నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్, భైంసా, నిర్మల్, నందిపేట్, భీంగల్‌లలో ఉద్యోగాలు చేయవాల్సి ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీనగర్‌లో ఈనెల 11న ఉదయం 10.30ల నుంచి హాజరుకావాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9948748428, 6305743423 నెంబ ర్లను సంప్రదించాలని అభ్యర్థులు తమవెంట రెజ్యూమ్, బయోడేటా, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫోటోలు తీసుకొని రావాలన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే అవగాహన సదస్సులు



బర్ధిపూర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే సీజీఆర్ఎఫ్ కృషి చేస్తుందని చైర్మన్ ఎరుకల నారాయణ పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సబ్‌డివిజన్ నిజామాబాద్ రూరల్ పరిధిలోని బర్ధిపూర్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీఆర్ఎఫ్ పరిధిలో 8 జిల్లాలు ఉన్నాయని ప్రతీ నెలా సబ్ డివిజన్‌లో ప్రజావేదిక నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి చేయూతనందిస్తున్నామని వినియోగదారులు నేరుగా తమ సమస్యలను అధికారులకు వివరించాలన్నారు. ఇందులో భాగంగా అధిక లోడ్ నాణ్యమైన విద్యుత్, బిల్లుల్లో హెచ్చుతగ్గులు, లూస్‌లైన్ వంటి అంశాలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరి ష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నా మన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లకావత్ కిషన్, మద్రిపల్లి రాజాగౌడ్, డీఈ రమేష్, ఏడీ బాలేష్, ఏఈలు రాజేందర్, శ్రీనివాస్, శంకర్, ప్రవీణ్, భాస్కర్, శర్వాణి, నాంపల్లి, సీనియర్ లైన్‌మెన్‌లు,లైన్‌ఇన్స్‌పెక్టర్‌లు,జేఎల్ఎంలు,సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఇందల్వాయి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన తూర్పు రాజన్న (48) కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు.మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.280	రూ. 310



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్ (10 గ్రా.)	వెండి (10 గ్రా.)
రూ.89,400	రూ.82,500	రూ.955

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 4.15, 7.10, 10.05)
: ఏ మైన్ క్రాఫ్ట్ (3డీ ఇంగ్లీష్) (1.55)
స్ర్కీన్-2 : జాక్ (10.20, 1.15, 4.10, 7.05, 10.00)
స్ర్కీన్-3 : జాట్ (హిందీ) (10.00, 1.10, 4.20, 7.30, 10.40)
స్ర్కీన్-4 : సికిందర్ (హిందీ) (10.40)
: గుడ్ బ్యాడ్ అగ్లీ (1.40)
: మ్యాడ్ స్క్వేర్ (4.35, 10.25)
: ఫలక్‌నామాదాస్ (7.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : జాక్ (10.45, 1.30, 4.20, 7.20, 10.20)
స్ర్కీన్-2 : గుడ్ బ్యాడ్ అగ్లీ (1.40, 10.20)
: ఫలక్‌నామాదాస్ (4.30)
స్ర్కీన్-3 : జాట్ (హిందీ) (11.00, 1.40, 4.30, 7.30, 10.30)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మ్యాడ్ స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్